సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం । 13 । మార్చి । 2023



గంగమ్మా..దీవించమ్మా..

చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లి సమీపంలో వెలసిన గంగమ్మ జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. -8లో..



రాజంపేట.. గుత్తోళ్లకు 'బాట'!

రాజంపేటకు గుత్తి పరిసరాల ప్రాంతాల నుంచి కూలీలు వలస వస్తున్నారు. ఈ ప్రాంతంతో విడదీయరాని బంధం ఏర్పరుచుకున్నారు. -8లో..

గరిష్టం/కనిష్టం
34.2/20.5

వాతావరణం

జిల్లాలో ఆదివారం 20.5 – 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

నేడే పోలింగ్

- నేడు పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు
- పోలింగ్ నిర్వహణకు సర్వం సిద్ధం చేసిన అధికారులు
- జిల్లాలో 131 పోలింగ్ కేంద్రాలు
- వైఎస్సార్ జిల్లాలో 81,317 మంది పట్టభద్రులు, 7461 మంది ఉపాధ్యాయ ఓటర్లు
- అన్నమయ్య జిల్లాలో 20,594 పట్టభద్రులు, 1958 ఉపాధ్యాయ ఓటర్లు
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి సామగ్రితో బయలుదేరిన ఎన్నికల యంత్రాంగం
- పోలీసుల పటిష్ట బందోబస్తు



డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల సామగ్రిని తీసుకుంటున్న సిబ్బంది



సాక్షి ప్రతినిధి, కడప: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. జిల్లా కేంద్రంలో 21 కౌంటర్లు ఏర్పాటు చేసి పోలింగ్ సిబ్బందిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఆమేరకు మండల కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. సోమవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ పోలింగ్ నిర్వహించనున్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 1,01,911 మంది పట్టభద్రులు, 9,419 మంది టీచర్లు ఓటు హక్కు పొందారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో 49 మంది అభ్యర్థులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోటీలో 12 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ముమ్మరంగా ప్రచారం కొనసాగించిన వీరి భవితవ్యం ఓటర్ల చేతిలో ఉంది. సోమవారం పోలింగ్ సందర్భంగా ఆయా అభ్యర్థులకు ప్రాధాన్యత క్రమంగా ఓటు వేయనున్నారు.

- పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, టీచర్ల ఎమ్మెల్సీ స్థానాలు దక్కించుకునేందుకు రాజకీయ పార్టీలు రంగ ప్రవేశం చేశాయి. ఆయా పార్టీలు తమ అభ్యర్థుల గెలుపు కోసం విశేషంగా కృషి చేశాయి. ఎన్నికల ప్రారంభం నుంచి ఎవరి ఎత్తుగడల్లో వారు తమ చతురతను ప్రదర్శించారు. ఓటర్లను ఆకర్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆదివారం రోజంతా పోలింగ్ ఏజెంట్ల ఏర్పాటు కోసం క్రియాశీలకంగా వ్యవహారాలు చక్కబెట్టుకున్నారు.

కాడి కిందపడేసిన టీడీపీ..

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఎన్నికలకు ముందే టీడీపీ కాడి కింద పడేసింది. ఓటమి తప్పదని గ్రహించిన ఆ పార్టీ అవసరమైతే పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని పిలుపు ఇవ్వడమే ఇందుకు నిదర్శనంగా విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా వెన్నపూస రవీంద్రారెడ్డి, టీడీపీ అభ్యర్థిగా రామగోపాల్‌రెడ్డి, పీడీఎఫ్ అభ్యర్థిగా నాగరాజు పోటీలో ఉన్నారు. వీరితోపాటు మరో 46మంది బరిలో ఉన్నారు. కాగా పశ్చిమ రాయలసీమలో టీడీపీ అభ్యర్థి విజయం కోసం పనిచేయాలని కోరాల్సిన అధ్యక్షుడు చంద్రబాబు అందుకు విరుద్ధంగా పీడీఎఫ్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కేడర్‌కు సూచించడంపై పలువురు విస్తుపోతున్నారు. వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఢీకొనే శక్తి టీడీపీకి లేదని తేలిపోయినట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు. టీడీపీ పిలుపును బట్టి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపు నల్లేరుపై నడకేనని స్పష్టమవుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ స్థానంలో కూడా ఏకపక్షంగా ఫలితాలు వెల్లడి కానున్నట్లు ఉపాధ్యాయ వర్గాలు భావిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న ఎంవీ రామచంద్రారెడ్డి విజయం కోసం ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మంగా తీసుకోవడమే అందుకు ప్రత్యేక కారణంగా వివరిస్తున్నారు. పైగా ప్రభుత్వ టీచర్ల ఓట్లు గణనీయంగా చీలిపోనున్నాయి. ఉద్యమ నాయకులమంటూ కత్తి నరసింహారెడ్డి, జీవీ నారాయణరెడ్డిలు ఉపాధ్యాయుల ఓట్లు చీలుస్తున్నట్లు సమాచారం. ఒంటేరు శ్రీనివాసులరెడ్డి దూకుడును డాక్టర్ అనిల్‌కుమార్ కట్టడి చేశారని తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీకి కరడుగట్టిన మద్దతుదారులు ఏకపక్షంగా నిలుస్తుండడంతో గెలుపు గుర్రంగా ఎంవీ రామచంద్రారెడ్డి నిలవనున్నట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారు.



పోలింగ్ సామగ్రిని తరలిస్తున్న దృశ్యం

ఓటు హక్కును వినియోగించుకోండి: కలెక్టర్ విజయరామరాజు



పట్టభద్రులు, టీచర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. 131 పోలింగ్ కేంద్రాల్లో పీఓలు, ఏపీఓలతోపాటు, మైక్రో అబ్జర్వర్లు, వెబ్ కాస్టింగ్ సిబ్బందిని నియమించాం. రిజర్వులో 49 మంది పీఓలు, 51మంది ఏపీఓలు, 135 మంది ఓపీఓలను, మొత్తంగా 235 మంది పోలింగ్ సిబ్బంది, 22 మంది సూక్ష్మ పరిశీలకులను రిజర్వులో ఉంచాం. ప్రశాంత పోలింగ్ కోసం పటిష్టమైన చర్యలు చేపట్టాం. ఓటు ఉన్న ప్రతి ఒక్క పట్టభద్రుడు, టీచర్ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలి. 11 రకాలైన గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి తీసుకొని అభ్యర్థులకు ప్రాధాన్యత ఓటు వేయాలి.

పోలింగ్ నిర్వహణకు పటిష్ట చర్యలు: ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



వైఎస్సార్ జిల్లాలో 93 పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రుల ఎన్నికలు, 38 పోలింగ్ కేంద్రాల్లో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ నిర్వహణ కోసం ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, 8మంది డీఎస్పీలు, 27మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 73మంది ఎస్‌ఐలు, 1200 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నాం. వీరితో పాటు 8 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 21 రూట్ మొబైల్స్, 36 ఫ్లెయింగ్ స్క్వాడ్, 36 వీడియో సర్వెలెన్స్, 22 పోలీస్ పికెట్లు, ఒక ప్లటూన్ ఏపీఎస్పీ బలగాలను వినియోగిస్తున్నాం. ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

ఎన్నికలకు తరలిన సిబ్బంది

పర్యవేక్షించిన డీఆర్వో, ఆర్డీఓలు



ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం

కడప సిటీ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆయా పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రితో అధికారులు, సిబ్బంది తరలి వెళ్లారు. ఆదివారం ఉదయం కడపలోని ఆర్ట్స్ కళాశాలలో పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అక్కడికి చేరుకున్న పోలింగ్ సిబ్బంది అక్కడి నుంచి సామగ్రితో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బస్సులు, ఇతర వాహనాల ద్వారా చేరుకున్నారు. ఎన్నికల సామగ్రి అందజేసే కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, వెంకటరమణ, ఇతర అధికారులు పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేయడంతో పాటు పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 131 పోలింగ్ కేంద్రాలు

జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆదేశాల మేరకు డిస్ట్రిబ్యూషన్ కేంద్రమైన ఆర్ట్స్ కళాశాల నుంచి పోలింగ్ సామగ్రిని సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లారు. ఇక్కడ పోలింగ్ సామగ్రిని సిబ్బంది తీసుకెళ్లే వాహనాల రూట్లను నంబర్ల వారీగా మొత్తం 21 కౌంటర్లను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి 38 పోలింగ్ కేంద్రాలు, పట్టభద్రులకు సంబంధించి 98 పోలింగ్ కేంద్రాలు కలిపి మొత్తం 131 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే సాధారణ, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అవసరమైనచోట్ల పటిష్ట బందోబస్తును కూడా ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పోలింగ్ సిబ్బందికి కూడా మూడు దశలుగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఎన్నికల నిర్వహణకు 131 మంది పీఓలు, 131 మంది ఏపీఓలు, 131 మంది ఓపీఓ-1లు, 106 మంది ఓపీఓ-2లు కలిపి మొత్తం 499 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. అలాగే 131 మంది మైక్రో అబ్జర్వర్స్‌ను నియమించారు.

ప్రశాంత ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్: జిల్లాలో గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నిలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత పోలింగ్ జరిగేలా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. సోమవారం గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తీసుకున్న భద్రతా ఏర్పాట్ల గురించి జిల్లా ఎస్పీ ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.

- ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అభ్యర్థులు రాజకీయపక్షాల నాయకులు, ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు.
- అభ్యర్థులు, ఓటర్లు, ఏజెంట్లు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలన్నారు.
- పోలింగ్ నిర్వహించే అధికారులతో సహా ఎవరు పోలింగ్ కేంద్రాలలోకి నీరు, ఇతర ద్రవ పదార్థాలను తీసుకు వెళ్లరాదన్నారు.
- ఓటర్లు, ఏజెంట్లు, అభ్యర్థులు మొబైల్ ఫోన్‌లు, ఐ పాడ్, టాబ్స్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పోలింగ్ కేంద్రంలోనికి తీసుకు వెళ్ల దానికి అనుమతిలేదన్నారు.
- ఎన్నికల సందర్భంగా ఎవరైనా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడటం వంటివి చేయరాదన్నారు.
- ఎవరైనా పోలింగ్ బూత్ లోపల ఫొటోలు, వీడియోలు తీసి ఎన్నికల నియమాలకు విరుద్ధంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో పోస్ట్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

వైఎస్సార్ ఆశయ సాధనే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

ఆవిర్భావ దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా



వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాల సాధన కోసమే వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించిందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు.

ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కడపలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డిలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించి, వందనం చేశారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యేతో మొదలైన వైఎస్సార్‌సీపీ ప్రస్థానం 151 మంది ఎమ్మెల్యేలు, 22 మంది ఎంపీలకు చేరిందన్నారు. ఎన్ని కష్ట నష్టాలు, ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ వైఎస్ జగన్ ప్రజలతో మమేకమై వారి విశ్వాసం చూరగొనడంలో సఫలీకృతులయ్యారన్నారు. అందుకే ప్రజలు దేశంలో ఏ పార్టీకి ఇవ్వని విజయాన్ని వైఎస్సార్‌సీపీకి ఇచ్చారన్నారు. దివంగత వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు మాత్రమే ఇచ్చిన హామీలేగాక ఇవ్వని హామీలు కూడా అమలు చేశారని తెలిపారు.

ప్రేమాభిమానాలతో పుట్టిన పార్టీ వైఎస్సార్‌సీపీ- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజల ప్రేమాభిమానాల్లోంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గతంలో మంత్రిగా, ముఖ్యమంత్రిగా పనిచేయకపోయినా ప్రజలకు మేలు చేయాలన్న చిత్తశుద్ధే వైఎస్ జగన్‌ను మంచి పరిపాలనాదక్షున్ని చేసిందని చెప్పారు. రాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దేందుకు ఆయన అనేక విధాలుగా శ్రమిస్తున్నారని, ఫలితంగా అన్ని సర్వేల్లోనూ అగ్రస్థానంలో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ కరిముల్లా, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు పాకా సురేష్, పార్టీ నాయకులు బీహెచ్ ఇలియాస్, హాఫీజుల్లా, ఐస్‌క్రీం రవి, బంగారు నాగయ్య, ఎస్. సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు, వి. నాగేంద్రారెడ్డి, షఫీ, సుభాన్‌బాషా, జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, మహిళా నేతలు రత్నకుమారి, టీపీ వెంకట సుబ్బమ్మ, శ్రీలక్ష్మి, సంధ్యారాణి, సుశీలమ్మ, తులశమ్మ పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 12 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పార్టీ నాయకుల్లో నూతనోత్సాహం కనిపించింది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించి, కేక్‌లు కట్ చేసి ఒకరినొకరు పంచుకుని సంబరాలు నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రమైన కడపలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- ప్రొద్దుటూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బి. లక్ష్మిదేవి, వైస్ చైర్మన్ బంగారు రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి బాబు, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పాల్గొన్నారు.
- పులివెందులలో బాకరాపురం ఆడిటోరియంలో పార్టీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.
- బద్వేల్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పార్టీ జెండాను ఎగురవేశారు. ఆడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కమలాపురం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, ఎన్. సుధాకర్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి పాల్గొన్నారు.
- జమ్మలమడుగు పట్టణంలోని తన కార్యాలయంలో ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఎర్రగుంట్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి సురేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

బధిరులు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు, నిర్వాహకులు

కడప కల్చరల్ : నేటి పోటీ ప్రపంచంలో బధిరులు కూడా అన్ని రంగాల్లో రాణించాలని హైదరాబాద్‌కు చెందిన ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటైర్డ్ జాయింట్ కమిషనర్ ఎస్‌ఏ ఫజులుల్లా తెలిపారు. కడప నగరంలోని మానస ఇన్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ బధిర మహిళా దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఫౌండేషన్ ఆఫ్ ద డెఫ్ ఉమెన్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానస చిన్నపరెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎస్‌ఏ ఫజులుల్లా, ప్రత్యేక అతిథిగా సంస్థ అధ్యక్షుడు సంఘమిత్ర సిరాజుద్దీన్, గౌరవ అతిథిగా లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి హాజరయ్యారు. సంస్థ ప్రతినిధి ధరణికుమారి మాట్లాడుతూ బధిరులు ఎందులోనూ తీసిపోరని, అన్ని రంగాలలో ధైర్యంగా ముందుకు వెళుతున్నారని చెప్పారు. సమస్యలను విజయవంతంగా పరిష్కరించుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున సంస్థ ప్రతినిధులు హాజరు కావడం ప్రశంసనీయమన్నారు. అతిథులు మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన బధిర మహిళలు ఉత్సాహంగా ఒకే వేదికపై పాల్గొనడం అపూర్వమన్నారు. లయన్ చిన్నపరెడ్డి ఈ సందర్భంగా బధిర మహిళా ప్రతినిధులను లయన్స్ క్లబ్ తరపున ఘనంగా సత్కరించారు. బధిర మహిళ ఫౌండేషన్ వైస్ చైర్మన్ అరుణ, ప్రధాన కార్యదర్శి యశోద, అధ్యక్షుడు కిశోర్, సంస్థ ప్రతినిధులు సిరాజ్ బాషా, బాలాజీరెడ్డి, శరత్, శ్రీకాంత్ తదితరులు ఈ సందర్భంగా బధిర మహిళలు, బాలలకు పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.

స్పందన తాత్కాలికంగా రద్దు

కడప సిటీ: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ విజయరామరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి స్పందన ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని ఆయన సూచించారు.

17న అంగన్‌వాడీల చలో అసెంబ్లీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17న చలో అసెంబ్లీ చేపడుతున్నట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను స్కీం వర్కర్లకు వర్తింపజేయాలన్నారు. ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారాలను మోపుతూ, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచి భారాలను మోపడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వేణుగోపాల్, కేసీ బాదుల్లా, చంద్రశేఖర్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వెటరన్ టీ-20 చాంపియన్‌గా 'అనంత' జట్టు



విజేతగా నిలిచిన అనంతపురం జట్టు

రన్నరప్‌గా హైదరాబాద్

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన ధనుంజయరెడ్డి మెమోరియల్ వెటరన్ టీ-20 క్రికెట్ టోర్నమెంట్ చాంపియన్‌గా అనంతపురం జట్టు నిలిచింది. ఆదివారం నిర్వహించిన ఫైనల్‌మ్యాచ్‌లో అనంతపురం, హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన హైదరాబాద్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. జట్టులోని ప్రదీప్ 100, షాబుద్దీన్ 62 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 196 పరుగులు మాత్రమే చేయగలిగింది. జట్టులోని చంద్రశేఖర్ 74, శ్రీధర్‌శర్మ 47 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్ ఇనాయతుల్లా 2 వికెట్లు తీశాడు. దీంతో అనంతపురం జట్టు 10 పరుగుల తేడాతో విజయం సాధించింది. విజేతలుగా నిలిచిన జట్లకు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి ట్రోఫీలను, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో క్రికెట్ సంఘం కార్యదర్శి ఎ. రెడ్డిప్రసాద్, సౌత్‌జోన్ కన్వీనర్ పి. సంజయ్‌కుమార్‌రెడ్డి, సభ్యులు మునికుమార్‌రెడ్డి, అబ్దుల్ రెహమాన్, విష్ణుమోహన్‌రావు, కరుణాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అశ్విన్‌కుమార్‌రాజు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామానికి చెందిన టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు చింతకుంట సత్యనారాయణ నాయుడు (77) అనారోగ్యంతో బాధపడుతూ గత బుధవారం మృతి చెందాడు. అదివారం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పోట్లదుర్తిలోని సత్యనారాయణ నివాసం వద్దకు వచ్చాడు.సత్యనారాయణ నాయుడు చిత్ర పటానికి నివాలర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉద్యావన శాఖ రాష్ట్ర ప్రధాన సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

బద్వేలు అర్బన్ : పట్టణంలోని శివానగర్‌కు చెందిన ఓ మహిళ శనివారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని శివానగర్‌కు చెందిన జంగిటిరమాదేవి (45) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. వివిధ ప్రాంతాల్లో వైద్యుల వద్ద చికిత్స చేయించుకున్నప్పటికీ నయం కాలేదు. దీంతో మనస్తాపానికి గురై శనివారం అర్ధరాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గుర్తించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని, కడపకు తీసుకెళ్లాలని సూచించడంతో రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స ప్రారంభించగానే మృతిచెందింది. మృతురాలి భర్త నెల్లూరు జిల్లా వింజమూరులో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు కాగా ఒకరికి వివాహమైంది. కుమార్తె అంజలి రాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ ఏఎస్‌ఐ సుబ్బారావు కేసు నమోదు చేశారు.

రాజంపేట.. గుత్తోళ్లకు బాట!

- పొట్టచేతపట్టుకుని వలసవచ్చిన నిరుపేదకూలీలు
- నాలుగుదశాబ్దాల కిందట ప్రారంభం
- రాజంపేటతో విడదీయరానిబంధం



కూలికోసం పట్టణ ప్రధాన రహదారిలో వేచి ఉన్న గుత్తోళ్లు (ఫైల్)

రాజంపేట : అన్నమయ్య జిల్లా రాజంపేట నుంచి పేదలు జీవనోపాధి కోసం ఏడారి దేశాలకు వెళుతుంటే.. గుత్తి పరిసరాల ప్రాంతాల నుంచి ఇక్కడికి నిరుపేద కూలీలు తరలివస్తున్నారు. ఈ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని తమ జీవనప్రయాణం సాగిస్తున్నారు. పొట్టచేతపట్టుకొని వలసవచ్చిన వారు ఇప్పుడు తమ జీవితాలను బాగుపరుచుకున్నారు.రాజంపేటతో విడదీయరాని బంధం ఏర్పరుచుకున్నారు.

2 వేలమందికిపైగా..

దాదాపు 2వేలమందికిపైగా కర్నూలు, అనంతపురం జిల్లాల పరిధిలోని పలు తాండాలు, దళిత,బలహీనవర్గాల నివాసాల నుంచి రాజంపేటకు తరలివచ్చారు. వివిధ రకాల పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. కుటుంబాలకు కుటుంబాలు ఇక్కడ స్థిరపడిపోయారు. రాజంపేటకు గుత్తోళ్లు రావడం నాలుగుదశాబ్దాల కిందట ప్రారంభమైంది. దీంతోఈ ప్రాంతానికి విడదీయరానిబంధం నెలకొనింది. పక్కజిల్లాల నుంచి వచ్చే నిరుపేద కూలీలకు కేరాఫ్ మారిపోయింది. వందలాది కుటుంబాల సంతతి ఇక్కడే పుట్టి, ఇక్కడే స్థిరపడిన పరిస్థితులకు దారితీసింది. కొందరికి ఇంటిపట్టాలు ఇవ్వడం, వారికి ఇక్కడే ఓటు హక్కు, రేషన్‌కార్డు లాంటి సౌకర్యాలను ప్రభుత్వం నుంచి లబ్ధిపొందుతున్నారు. దివంగత సీఎం వైఎస్‌రాజశేఖరెడ్డి పాలనలో ఈ పరిస్థితులు ఉండేవి. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కూడా స్వంతింటి కలనేరవేర్చుకుంటున్నారు. నవరత్నాలపథకాలతో గుత్తోళ్ల కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయి. కొన్ని వార్డుల్లో వీరు ఓటు బ్యాంకును శాసించే స్థాయికి చేరుకున్నారంటే రాజంపేటలో వీరి ప్రాబల్యం ఎలా ఉందో అవగతమవుతోంది.

ఏ పనికైనా వారే..

రాజంపేట పరిసర ప్రాంతాల్లో స్థానిక కూలీలకు డిమాండ్ ఉండేది. గుత్తోళ్ల ప్రస్థానం మొదలైనప్పటి నుంచి ఈ డిమాండ్ పడిపోయింది. ఏ పనికైనా వారే ముందుంటారు.రాజంపేట,ఒంటిమిట్ట,రైల్వేకోడూరు వరకు భవన నిర్మాణరంగం పనులకు వారిని పిలుపిస్తుంటారు.

గుత్తోళ్లు అని ఎందుకంటారంటే..

కర్నూలు, అనంతపురం జిల్లాలోని ప్యాపిలి, కోవెలకుంట్ల, పత్తికొండ, సుగ్గలి. గుత్తి , డోన్ పరిసరాల ప్రాంతాలకు చెందిన అనేక మంది పేద కూలీలు ఒకప్పుడు గుత్తి రైల్వేస్టేషన్‌కు వచ్చి రాజంపేటకు చేరుకొనేవారు..ఇది 40 ఏళ్ల కిందటి మాట. అప్పటి నుంచి పైన చెప్పిన ప్రాంతాల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చినా గుత్తోళ్లగానే చెప్పుకుంటూ వచ్చారు. ఆ విధంగా గుత్తోళ్లు అని పేరు స్థిర పడిపోయింది.

ఎక్కడెక్కడ ఉంటారు

పట్టణంలో ప్రధానంగా రామ్‌నగర్, ఎన్‌టీఆర్‌నగర్, బోయపాళెం, బసినాయుడుగారిపల్లె, ఉస్మాన్‌నగర్ బైపాస్‌తోపాటు పలు వార్డుల్లోని ఖాళీ ప్రదేశాల్లో వీరు తాత్కాలిక గుడారాలు వేసుకున్నారు. రామ్‌నగర్‌లో చాలామంది ఇప్పటికే సొంతిళ్లు నిర్మించుకుని స్థిరపడిన వారు ఉన్నారు.

పేద కూలీలకు అండగా ప్రభుత్వం



రాజంపేటలో వలస కార్మికులకు (గుత్తోళ్లు) ప్రభుత్వం అండగా నిలిచింది. వారికి మహానేత వైఎస్‌రాజశేఖరెడ్డి, ప్రస్తుత సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇంటి స్థలాలు కేటాయించారు. వారికి పలు పథకాల వల్ల లబ్ధి కలుగుతోంది.రోజంతా కష్టపడి తమ కుటుంబాలను బాగుపరుచుకుంటున్నారు. అన్ని రంగాల్లో కూలీ పనులకు వీరినే పిలుస్తుంటారు.

-జె.కృష్ణారావుయాదవ్, పట్టణ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ, రాజంపేట

కష్టించి పని చేస్తారు



కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని మారుమూల గ్రామాలకు చెందిన తాండాల నుంచి అనేకమంది రాజంపేటలో జీవనం సాగిస్తున్నారు. వీరు 2వేలకుపైగా ఉన్నారు. వీరు కష్టపడే మనస్తత్వం కలిగి ఉంటారు. అందువల్ల అన్ని పనులకు వీరిని పిలుస్తారు.

- నల్లబోతుల ధర్మన్న, కూలీల ప్రతినిధి, రాజంపేట

మూడేళ్ల వయస్సులో వచ్చా..



నేను మూడేళ్ల వయస్సులో రాజంపేటకు వచ్చాను. అప్పటి నుంచి కుటుంబసభ్యులందరం ఇక్కడే స్థిరపడిపోయాం. రాజంపేట వాసులు మనసున్న మారాజులు. కష్టాల్లో వచ్చిన వారికి అండగా నిలిచారు. దీంతో ఒకప్పుడు పదుల సంఖ్యలో ఉండేవారు ఇప్పుడు వేలసంఖ్యలో ఉన్నారు. మేము ఇప్పటికీ రాజంపేట వాసులే అనుకుంటున్నాము.

-పత్తికొండ రాఘవేంద్ర, కూలీ, రాజంపేట

రూ. 300 కోసం హత్య



భీమిశెట్టి లక్ష్మీనరసింహులు మృతదేహం

సిద్దవటం : చెట్లు కొట్టినందుకు డబ్బు చెల్లించే విషయపై జరిగిన ఘర్షణలో భీమిశెట్టి లక్ష్మీనరసింహులు (28) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఆదివారం ఉప్పరపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దవటం మండలం ఉప్పరపల్లె గ్రామానికి చెందిన భీమిశెట్టి లక్ష్మీనరసింహులు మాధవరం-1 గ్రామంలోని పెద్దమ్మ లక్ష్మమ్మ ఇంటో చెట్లు కొట్టించేందుకు ఇదే గ్రామంలోని ఎస్‌కేఆర్ నగర్ ఎస్సీ కాలనీకి చెందిన పత్తూరు శ్రీనివాసులుతో రూ. 600 కూలి ఇచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నాడు. శ్రీనివాసులుకు రూ.600 చెల్లించాడు. మరో రూ. 300 ఇవ్వాలని శ్రీనివాసులు డిమాండ్ చేశాడు.ఈ విషయమై ఆదివారం ఉప్పరపల్లెకు వెళ్లి లక్ష్మీనరసింహులుతో వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. భీమిశెట్టి లక్ష్మీనరసింహులుపై పత్తూరు శ్రీనివాసులు, మునీంద్ర, నాగేంద్రలు రాడ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన వ్యక్తిని వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పజెప్పినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై పోలీసుల దాడి అమానుషం



బాధితుడితో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నేతలు

కడప అర్బన్ : అన్నమయ్య జిల్లా నందలూరుకు చెందిన ముమ్మడి అవినాష్‌రెడ్డి (30)పై ఈనెల 9వ తేదీ రాత్రి 9:20 గంటలకు రాజంపేట పోలీసులు విచక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరచడం అమానుషమని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కులసంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి సి. వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు పి. రెడ్డెయ్యలు పేర్కొన్నారు. ఆదివారం వారు కడప రిమ్స్‌లో తీవ్రగాయాలతో చికిత్సపొందుతున్న బాధితుడిని కలిసి పరామర్శించి, వివరాలను సేకరించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన రాత్రి బాధితుడు ముమ్మడి అవినాష్‌రెడ్డి రాజంపేటలో వ్యక్తిగత పనులను ముగించుకుని తిరిగి నందలూరుకు వెళుతున్న సమయంలో బైపాస్ రోడ్డులో ఇద్దరు పోలీసులు ఆపారు. మోటార్‌బైక్ తాళాలు ఇవ్వాలన్నారు. ఎందుకు సార్ అడుగగా, మాకే ఎదురుచెపుతావా అన్నారు. తరువాత బైక్ తాళాలైనా ఇవ్వు.. లేదంటే తమకు మద్యం తెచ్చి ఇవ్వు అని అతనిని గద్దించారన్నారు. మరో ప్రైవేటు వ్యక్తితో కలిసి ఇద్దరు కానిస్టేబుళ్లు విచక్షణా రహితంగా వీపు, కాళ్లు, తొడలపైనా కట్టెతో కొట్టారని బాధితుడు పౌరహక్కులసంఘం నేతలకు తెలియజేశారు. సంఘటన జరిగిన సమయంలో గాయపడిన అవినాష్‌రెడ్డి, స్థానికుల సహాయంతో 108 అంబులెన్స్‌లో రాజంపేట ఏరియా ఆసుపత్రికి వెళ్లాడు. అక్కడ వైద్యులు ఎంఎల్‌సీ (మెడికో లీగల్ కేసు) కింద నమోదు చేసి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు స్పందించలేదన్నారు. ఈనెల 10వ తేదీన కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చికిత్సకోసం చేరాడు. పోలీసులు ఎవరూ విచారించకపోగా, పోలీసులపై దాడి చేశారని బాధితుడిపైనే హత్యాయత్నం కేసు నమోదు చేయడం అన్యాయమన్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఈ సంఘటనపై విచారణ చేయలన్నారు. బాధితుడికి చట్టపరంగా న్యాయం జరిగేలా చూడాలని వారు డిమాండ్ చేశారు.

గంగమ్మా.. దీవించమ్మా..



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట - బుగ్గలేటిపల్లి సమీపంలో వెలసిన గంగమ్మ జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.జాతర వారాల్లో భాగంగా మూడోఆదివారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జామున 3 గంటల నుంచి బారులు తీరారు. అలాగే ఆలయ ఆవరణలోని వీరభద్ర స్వామి, అంజనేయ స్వామి, సాయిబాబాలను శిదర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈవో సురేష్ కుమార్ ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని దాతలు చేపట్టారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీకేదిన్నె ఎస్‌ఐ బి. అరుణ్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.



జాతరకు హాజరైన భక్తజనం

తెలుగు నాటక వికాసానికి 'కోలాచలం' కృషి



కోలాచలం శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు, సిబ్బంది

కడప కల్చరల్ : తెలుగు నాటక వికాసానికి ప్రముఖ నాటక ప్రయోక్త, ప్రముఖ రచయిత, నటులు, దర్శకులు కోలాచలం శ్రీనివాసరావు కృషి చేశారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో కోలాచలం 170వ జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి సంచాలకులు, గ్రంథాలయ సిబ్బంది, అభిమానులు, రంగ స్థల కళాకారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో నాటక వికాసానికి బళ్లారి కేంద్రంగా మారిందని, ధర్మవరం కృష్ణామాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు నాటక వికాసానికి కారకులన్నారు. సమకాలికులైన వీరిలో ధర్మవరం వారు ఆంధ్ర నాటక పితామహుడిగా పేరు పొందారన్నారు.కోలాచలం శ్రీనివాసరావు మరాఠి నాటక ప్రభావంతో తెలుగు నాటక రచనకు పూనుకుని 30కి పైగా నాటకాలు రాశారన్నారు. దాదాపు అవన్నీ ఎంతో ప్రాచుర్యం పొందాయని తెలిపారు. ప్రదర్శనల కోసం నాటక శాలలను నిర్మించిన ఘనత కోలాచలానిదేనని కొనియాడారు. ప్రపంచ నాటక రంగ చరిత్రను తొలిసారిగా ఆంగ్లంలో రచించి విశ్వవిజ్ఞాన వేదికపై తెలుగు వారి ఘనతను చాటిన రచయిత కోలాచలమేనన్నారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ కోలాచలానికి వేదాలు, భగవద్గీత అభిమాన గ్రంథాలని, వేదకాలపు సాంఘిక పరిస్థితులు గురించి ఆయన ఎన్నో వ్యాసాలు రాశారన్నారు. గ్రంథ పాలకులు రమేష్‌రావు కోలాచలానికి కడపతోగల అనుబంధాన్ని వివరించారు. రచయిత కొత్తపల్లి రామాంజనేయులు మాట్లాడుతూ కోలాచలంపై షేక్‌స్పియర్ ప్రభావం ఉందన్నారు. కార్యక్రమంలో వైవీయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పి.శివారెడ్డి, బ్రౌన్ కేంద్రం జూనియర్ అసిస్టెంట్ మౌనిక, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో నుంచి కిందపడి బాలుడికి గాయాలు

మదనపల్లె (అన్నమయ్య జిల్లా) : ఆటోప్రమాదంలో బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో జరిగింది. చీకలబైలు పంచాయతీ బార్లపల్లెకు చెందిన లక్ష్మీదేవి తన కుమారుడు బి.ఖగేష్(8), కుమార్తెతో కలిసి వారంరోజుల క్రితం పుట్టింటికి వచ్చింది. తిరిగి మెట్టినిల్లు అయిన బి.కొత్తకోట మండలం మొగసాలమర్రికు సోదరుడు గోపితో కలిసి ఆటోలో బయలుదేరింది. వేంపల్లె క్రాస్‌వద్ద ఆర్టీసీ బస్సు వేగంగా ఆటోపై దూసుకురావడంతో బస్సును తప్పించేందుకు డ్రైవర్ వాహనాన్ని పక్కకు తిప్పాడు. ఆటోలో ఒకవైపుగా కూర్చున్న ఖగేష్ అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలయ్యాయి.

మంటల్లో కాలిపోయిన కారు



కాలిపోతున్న కారు

జమ్మలమడుగు : మైలవరం మండలం బొగ్గులపల్లి గ్రామ పొలిమేరలో పార్కింగ్ చేసిన కారులో మంటలు చెలరేగి కారు తగలబడిపోయింది. మైలవరం ఎస్‌ఐ రామకృష్ణ కథనం మేరకు..బొగ్గులపల్లి గ్రామంలో దేవర ఉండటంతో ప్రొద్దుటూరుకు చెందిన ఆంజనేయరెడ్డి బంధువుల ఇంటికి వచ్చారు.దేవర ఉండటంతో గ్రామ పొలిమేర్లలోనే వాహనాలను నిలిపేశారు.ఆంజనేయరెడ్డి కారును కూడా అక్కడే పార్కింగ్ చేశారు.ఈ ప్రాంతంలో ఎండుగడ్డి ఎక్కువగా ఉండటం, ఆకతాయిలు బీడీలు తాగి పడేయడంతో గడ్డి అంటుకుంది. మంటలు వాహనాలు నిలిపిన ప్రాంతానికి వ్యాపించాయి.మంటల్లో ఆంజనేయరెడ్డి కారు కాలిపోయింది. ఈ విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో మిగిలిన వాహనదారులు అప్రమత్తమయ్యారు. వాహనాలను దూరంగా తీసుకెళ్లి నిలిపారు.

ఇంట్లో మందలించారని విద్యార్థిని ఆత్మహత్య



బత్తల సిరి (ఫైల్)

చింతకొమ్మదిన్నె : మండలంలోని లక్ష్మీనారాయణ పురం గ్రామానికి చెందిన బత్తల సిరి అనే విద్యార్థిని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. చింతకొమ్మదిన్నె ఎస్‌ఐ బి. అరుణ్‌రెడ్డి కథనం మేరకు మండలంలోని జె.కొత్తపల్లె పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బత్తల సిరి గ్రామంలో సహచర పిల్లలతో ఆడుకుంటూ గొడవ పడటంతో ఇంట్లో వాళ్లు మందలించారు.మనస్తానికి గురైన సిరి ఆదివారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందిందని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వ్యక్తిపై హత్యాయత్నం

ముద్దనూరు : స్థానిక సాయినగర్ కాలనీకి చెందిన శ్రీనివాసులరెడ్డిపై అనంతపురంలో శనివారం రాత్రి హత్యాయత్నం జరిగింది. స్థానిక పోలీసులకు అందిన సమాచారం మేరకు శ్రీనివాసులరెడ్డి, భూమికి సంబంధించిన సమస్యలో ఉన్నారు. కొంతకాలంగా అతను అనంతపురంలో నివసిస్తున్నాడు. భూ వివాదాలే ఇతనిపై హత్యాయత్నానికి కారణమై ఉండవచ్చని సమాచారం. 2011 డిసెంబర్ నెలలో ముద్దనూరు - ఆర్టీపీపీ రహదారిలో ఇతనిపై హత్యాయత్నం జరిగింది.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

మదనపల్లె (అన్నమయ్య జిల్లా): కారు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. కలిచెర్ల గ్రామం ఎర్రసానివారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు ఎం.మల్లికార్జున (30) బెంగళూరులో కూలిపనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం స్వగ్రామానికి వచ్చాడు. ఆదివారం మధ్యాహ్నం సొంతపనులపై ద్విచక్రవాహనంలో పెద్దమండ్యంకు బయలుదేరాడు. కలిచెర్ల సచివాలయం వద్ద వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో మల్లికార్జున తీవ్రంగా గాయపడ్డాడు.